క్లుప్తంగా

వార్షిక పన్ను చెల్లించి రాయితీని పొందండి

మణికొండ: మున్సిపాలిటీలలో 2023–24 సంవత్సరం వార్షిక ఆస్తిపన్నును ఏప్రిల్ నెలాఖరు వరకు చెల్లిస్తే ఐదు శాతం రాయితీ వర్తిస్తుందని దాన్ని సద్వినియోగం చేసుకోవాలని మణికొండ, నార్సింగి మున్సిపాలిటీల అధికారులు ప్రకటించారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని మున్సిపాలిటీల అభివృద్ధికి తమ వంతు సహకారం అందించాలని వారు కోరారు. పన్ను చెల్లింపుదారులు ఆన్‌లైన్‌లో తమ పన్నులను చెల్లించవచ్చని సూచించారు.

అంతరిక్ష విజ్ఞానం అంతరాలను తొలగిస్తుంది



విద్యార్థులతో మాట్లాడుతున్న ఇస్రో శాస్త్రవేత్త శివప్రసాద్

శంషాబాద్: అంతరిక్ష విజ్ఞానం అంతరాలను తొలగిస్తుందని ఇస్రో శాస్త్రవేత్త ఎల్లా శివప్రసాద్ అన్నారు. మంగళవారం పట్టణంలోని విద్యానికేతన్‌లో ఆయన మాట్లాడుతూ.. అంతరిక్ష విజ్ఞానం మానవ అంతరాలను తొలగిస్తుందన్నారు. విద్యార్థులు వైజ్ఞానికంగా వేసే ముందడుగు సమాజానికి అన్ని రంగాల్లో మేలు చేస్తుందన్నారు. వైజ్ఞానిక ప్రపంచమే వాస్తవికతను కలిగి ఉంటుందని సౌరవిజ్ఞాన శాస్త్రవేత్త డాక్టర్ జయప్రకాష్ పేర్కొన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రుల వద్ద అన్నదానం

గోల్కొండ: ప్రభుత్వ ఆస్పత్రుల వద్ద రోగులు, వారి సహాయకులకు ప్రతి రోజూ అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నామని గోల్కొండ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బషీరుద్దీన్ తెలిపారు. మంగళవారం ఆయన గోల్కొండ ఏరియా ఆస్పత్రి వద్ద రోగులు, వారి సహాయకులకు భోజన ప్యాకెట్లు అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ఈ అన్నదాన కార్యక్రమాన్ని 398 రోజులుగా నిర్వహిస్తున్నామన్నారు. దాతలు, శ్రేయోభిలాషుల సహకారంతో ఈ కార్యక్రమం కొనసాగుతుందన్నారు.

ఘనంగా న్యూ ఈడెన్ స్కూల్ గ్రాడ్యుయేషన్ డే



గ్రాడ్యుయేషన్ డే వేడుకల్లో చిన్నారులు

గోల్కొండ: గుడిమల్కాపూర్‌లోని న్యూ ఈడెన్ హైస్కూల్ ప్రీ ప్రైమరీ గ్రాడ్యుయేషన్ డే వేడుకలు మంగళవారం ఘనంగా జరిగాయి. రాజలింగయ్య కబడ్డీ స్టేడియంలో జరిగిన వేడుకల్లో పాఠశాల కరస్పాండెంట్ బి.గాలయ్య ప్రీ ప్రైమరీ టీచర్లతో కలిసి చిన్నారులకు పట్టాలు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ ఎ. శశిపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సాయుధ రైతాంగ పోరాటానికి ఆద్యుడు దొడ్డి కొమురయ్య



దొడ్డి కొమురయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దర్పల్లి నర్సింహ, హన్మంతు

జియాగూడ: తెలంగాణ సాయుధ పోరాటం ఆధ్యుడు దొడ్డి కొమురయ్య అని బీజేపీ రాష్ట్ర గొర్ల కాపరుల సెల్ కో కన్వీనర్ దర్పల్లి నర్సిములు అన్నారు. మంగళవారం జియాగూడలో మల్లన్న కురుమ సంఘం ఆధ్వర్యంలో జయంతి వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో సంఘం చైర్మన్ కె.జగన్నాథ్, అధ్యక్షుడు హన్మంతు హిరోడే, ఉపాధ్యక్షులు డీఈ. రమేష్, ప్రధాన కార్యదర్శి అమర్నాథ్ హిరోడే, కోశాధికారి జి.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు, రేపు జాబ్‌మేళా

కాచిగూడ: భారత్ సేవా సెంటర్ ఆధ్వర్యంలో ఈనెల 5, 6 తేదీల్లో మణికొండలో జాబ్‌మేళాను నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ డైరెక్టర్ వెంకట్‌రెడ్డి ప్రకటించారు. ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 3 గంటల వరకు జరిగే జాబ్‌మేళాలో పాల్గొనే అభ్యర్థులకు ఎలాంటి రుసుము ఉండదని పూర్తి స్థాయిలో ఉచితంగా ఉంటుందని తెలిపారు. ఇంటర్మీడియట్, డిగ్రీ, పీజీ, ఇంజినీరింగ్, ఎంబీఏ అర్హత కలిగిన అభ్యర్థులు ఈ జాబ్‌మేళాలో పాల్గొనవచ్చని వివరించారు.

ప్రజాభవన్‌లతో ప్రజలకు మేలు



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న మంచిరేవుల నాయకులు

మణికొండ: ప్రతి గ్రామంలో సామూహిక, శుభకార్యాలు నిర్వహించుకునేందుకు ప్రజాభవన్‌లు ఉంటే ఎంతో సౌకర్యంగా ఉంటుందని వాటి నిర్మాణానికి కౌన్సిలర్లు కృషి చేయాలని ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ అన్నారు. నార్సింగి మున్సిపాలిటీ, మంచిరేవుల గ్రామంలో గతంలో ప్రహరీగోడ నిర్మించిన స్థలంలో ప్రజాభవన్‌ను నిర్మించాలని నార్సింగి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ప్రవీణ్‌యాదవ్, బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షుడు ఆర్. నర్సింహాల ఆధ్వర్యంలో మంగళవారం గ్రామ నాయకులు ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రజాభవన్‌లు ప్రతి గ్రామంలో ఉండాలని దీనికి అనువైన స్థలాలను ఎంపిక చేయాలన్నారు. పేదలు, మధ్య తరగతి వారు చిన్న, చిన్న శుభకార్యాలు ప్రజాభవన్‌లో చేసుకుంటారన్నారు.

- మంచిరేవుల ప్రజాభవన్‌కు మొదట రూ.50లక్షలు, మరోసారి రూ. 50లక్షలు కేటాయిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.
- అంబేడ్కర్ కమ్యూనిటీహాల్‌కు గతంలో రూ.25 లక్షలు మంజూరు అయ్యాయని మరో రూ.30 లక్షలు మంజూరు చేయాలని ప్రవీణ్ యాదవ్ ఎమ్మెల్యేను కోరినట్టు సమాచారం.

నాయకులు పొన్న రమేష్, విష్ణువర్ధన్‌రెడ్డి, క్రాంతి తదితరులు పాల్గొన్నారు.

రైతులు బ్యాంకు సేవలను వినియోగించుకోవాలి

నాబార్డ్ అడిషనల్ జనరల్ మేనేజర్ స్వాతి తివారి



స్వాతి తివారిని సన్మానిస్తున్న వ్యవసాయ విశ్వవిద్యాలయం అధికారులు

ఏజీవర్సిటీ: వ్యవసాయం అనుబంధ రంగాలకు అవసరమైన ఆర్థిక తోడ్పాటును తాము అందిస్తున్నామని రైతులు బ్యాంకుల సేవలను వినియోగించుకోవాలని నాబార్డ్ అడిషనల్ జనరల్ మేనేజర్ స్వాతి తివారి అన్నారు. ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో జరుగుతున్న దక్షిణ తెలంగాణ మండల వ్యవసాయ పరిశోధన, విస్తరణ సలహా సంఘం సమావేశం రెండో రోజుకు చేరింది. ఈ ముగింపు సమావేశంలో నాబార్డ్ అడిషనల్ జనరల్ మేనేజర్ పాల్గొన్ని తగిన సలహాలు, సూచనలు ఇచ్చారు. బ్యాంకులు రైతాంగం కోసం అనేక నూతన సబ్సిడీ పథకాలు ప్రవేశ పెట్టడం జరిగిందని వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వ్యవసాయ విశ్వవిద్యాలయం రూపొందించిన అనేక నూతన వ్యవసాయ పద్ధతుల గురించి పరిశోధన సంచాలకులు డాక్టర్ వెంకటరమణ వివరించారు. ఆధునిక పద్ధతుల్ని పాటించి సాగును లాభదాయకంగా మలుచుకోవాలని ఆయన సూచించారు. వ్యవసాయ విశ్వవిద్యాలయం ద్వారా ఎప్పటికప్పుడు అవసరమైన సమాచారాన్ని రైతాంగానికి అందజేసేందుకు నిరంతరం కృషి చేస్తున్నామన్నారు. ప్రధాన శాస్త్రవేత్తలు వారి పరిశోధన ఫలితాలను రైతులకు వివరించారు. భూసార పరిరక్షణ, పంటల మార్పిడి, చిరుధాన్యాల సాగు, సహజ వనరుల పరిరక్షణ తదితర అంశాలపై శాస్త్రవేత్తలు, సూచనలు, సలహాలు ఇచ్చారు.

'రంజాన్ అత్యంత పవిత్ర మాసం'

కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు



ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి నదీమ్‌జావేద్ తదితరులు

శంషాబాద్: రంజాన్ అత్యంత పవిత్ర మాసమని ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి నదీమ్‌జావేద్ అన్నారు. మున్సిపాలిటీలోని వైఎస్ఆర్ గార్డెన్‌లో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు సంజయ్‌యాదవ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సంప్రదాయ వేడుకలు జాతీయ సమగ్రతకు దోహదం చేస్తాయన్నారు. మతసామరస్యానికి ప్రతీకగా రంజాన్ వేడుకలు జరుగుతాయని డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి అన్నారు. పీసీసీ ప్రధాన కార్యదర్శి జ్ఞానేశ్వర్‌ముదిరాజ్, పీసీసీ ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు జల్లపల్లి నరేందర్, మండల అధ్యక్షుడు శేఖర్‌యాదవ్, నజీర్, జక్కుబాయి, జావేద్, మైలారం సులోచన, బొబ్బిలి కృష్ణ, యాదయ్య, బొబ్బిలిశేఖర్, శ్రీధర్‌యాదవ్, జహంగీర్ తదితరులున్నారు.

సాంకేతిక లోపంతో ఇండిగో విమానం ల్యాండింగ్

శంషాబాద్: సాంకేతిక కారణాలతో బెంగళూరు నుంచి వారణాసి వెళ్లాల్సిన విమానం శంషాబాద్ ఎయిర్‌పోర్టులో అత్యవసరంగా ల్యాండైంది. వివరాల ప్రకారం.. మంగళవారం ఉదయం బెంగళూరు నుంచి వారణాసికి 165 మంది ప్రయాణికులతో బయలుదేరిన ఇండిగో విమానంలో కొంత దూరం వెళ్లాక సాంకేతిక లోపం తలెత్తింది. దీంతో సంబంధిత పైలట్లు ఏటీసీకి సమాచారం అందించడంతో శంషాబాద్ ఎయిర్‌పోర్టులో ల్యాండ్ చేయడానికి అనుమతినిచ్చారు. ఈ మేరకు పైలెట్స్ శంషాబాద్ ఎయిర్‌పోర్టులో విమానాన్ని సురక్షితంగా ల్యాండ్ చేశారు. అనంతరం ప్రయాణికులను ప్రత్యామ్నాయ విమానాల్లో పంపించినట్లు ఎయిర్‌పోర్టు వర్గాలు ప్రకటించాయి.

బాలిక అదృశ్యం

- ఆటోడ్రైవర్ కిడ్నాప్ చేశాడని తల్లిదండ్రుల ఫిర్యాదు

రాజేంద్రనగర్: స్కూల్‌కు వెళ్లిన ఓ మైనర్ బాలిక కనిపించకుండా పోయిన ఘటన రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సన్‌సిటీ ప్రాంతానికి చెందిన 16 ఏళ్ల బాలిక ఇంట్లో నుంచి స్కూల్‌కు వెళ్లి తిరిగి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు స్కూల్‌తో పాటు బంధువులు, స్నేహితులు వద్ద వాకాబు చేశారు. సోమవారం ఉదయం సదరు బాలిక ఆటోలో స్కూల్‌కు వెళ్లినట్టు సమాచారం. ఆటో డ్రైవర్ కోసం వెతికినా జాడ తెలియకపోవడం, సెల్‌ఫోన్ స్విచ్ ఆఫ్ ఉండటంతో తమ కూతురును ఆటో డ్రైవరే కిడ్నాప్ చేశాడని వారు ఆరోపిస్తూ.. పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

హనుమాన్ శోభాయాత్రకు భారీ బందోబస్తు



మాట్లాడుతున్న డీసీపీ జగదీశ్వర్‌రెడ్డి

రాజేంద్రనగర్: హనుమాన్ శోభాయాత్ర సందర్భంగా భారీ బందోబస్తు నిర్వహిస్తున్నట్లు రాజేంద్రనగర్ డివిజన్ డీసీపీ జగదీశ్వర్‌రెడ్డి వెల్లడించారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ.. శోభాయాత్రలను భక్తి శ్రద్ధలతో నిర్వహించుకోవాలని సూచించారు. ర్యాలీలకు తప్పనిసరిగా స్థానిక పోలీసుల నుంచి అనుమతులు తీసుకోవాలన్నారు. ఇతరులకు ఇబ్బంది కలగకుండా శోభాయాత్ర నిర్వహకులు చూసుకోవాలన్నారు. శోభాయాత్ర దారిని ఇప్పటికే పరిశీలించినట్లు ఆయన తెలిపారు. ఏసీపీలు, సీఐలు, సబ్ ఇన్‌స్పెక్టర్లు ఆయా ప్రాంతాల్లో శోభాయాత్రను ఎప్పటికప్పుడు పరిశీలిస్తారన్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన చర్యలు చేపడుతున్నామన్నారు. సీసీ కెమెరాలలో ఎప్పటికప్పుడు నిఘాను ఏర్పాటు చేసి పరిస్థితిని పరిశీలిస్తామన్నారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

రాజేంద్రనగర్: అనుమానాస్పద స్థితిలో ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన మైలార్‌దేవ్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. లక్ష్మీగూడ రాజీవ్ గృహకల్ప ప్రాంతానికి చెందిన ప్రకాష్ (35) దినసరి కూలీ. కాగా సోమవారం ఉదయం పనికి వెళ్లిన ప్రకాష్ తిరిగి ఇంటికి రాలేదు. కాటేదాన్ ప్రాంతంలో నిలిపిఉన్న ఓ ట్రాలీ ఆటోలో అనుమానాస్పద స్థితిలో మృతి చెంది ఉన్నాడు. స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో వారు ఘటన స్థలానికి చేరుకుని మృతదేహానికి పంచనామా నిర్వహించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇఫ్తార్ విందులతో ప్రేమాభిమానాలు



ఇఫ్తార్ విందులో అసదుద్దీన్ ఒవైసీతో ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: ఇఫ్తార్ విందులు స్థానికుల మధ్య ప్రేమాభిమానులకు అద్దం పడుతాయని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్, హైదరాబాద్ ఎంపీ, అసదుద్దీన్ ఒవైసీ అన్నారు. మంగళవారం మెహిదీ కాలనీలో మజ్లిస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.... రంజాన్ మాసం పవిత్రమైనదని ఈ మాసంలోనే అల్లా ప్రత్యేకంగా దివ్యఖురాన్ గ్రంథాన్ని ప్రసాదించాడని తెలిపారు. రంజాన్ మాసంలో ఉపవాస దీక్షలు ఉండటంతో పాటు రాత్రిపూట జరిగే తరావీ ప్రార్థనల్లో పాల్గొనాలని సూచించారు. తరావీ ప్రార్థనల్లో మసీదు ఇమామ్ ఖురాన్ గ్రంథాన్ని వినిపిస్తారని, తరావీ ప్రార్థనలు కేవలం రంజాన్ మాసంలోనే జరుగుతాయన్నారు. రంజాన్ మాసంలో నిరుపేదలకు దానధర్మాలు చేయాలని, ఆస్తులు, న్యాయబద్ధంగా సంపాదించిన డబ్బులో నుంచి జకాత్ తీసి నిరుపేదలకు పంచాలని సూచించారు. ఇఫ్తార్ విందులో మజ్లిస్ నాయకులు హారూన్ ఫరాన్, వజీ ఉజ్జమా, బదర్ ఉద్దీన్, అలీమొద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

చెట్టుకు ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

రాజేంద్రనగర్: గుర్తు తెలియని వ్యక్తి చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మైలార్‌దేవ్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. బుద్వేల్ రైల్వేస్టేషన్‌కు వెళ్లే దారిలో 30–35 ఏళ్లున్న వ్యక్తి చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మంగళవారం ఉదయం స్థానికులు గమనించి మైలార్‌దేవ్‌పల్లి పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న వారు పంచనామా నిర్వహించి మృతదేహాన్ని ఉస్మానియా మార్చురీకి తరలించారు. మృతుడి సంబంధీకులు ఎవరైనా ఉంటే ఉస్మానియా మార్చురీ సిబ్బంది, మైలార్‌దేవ్‌పల్లి పోలీసులను సంప్రదించాలని కోరారు.

నకిలీ సరుకులకు బ్రాండెడ్ లేబుళ్లు

- కర్ణాటకకు అక్రమ రవాణా
- నలుగురు నిందితుల అరెస్ట్

జియాగూడ: నగరం నుంచి నకిలీ నిత్యావసర సరుకులు తీసుకెళ్లి కర్ణాటకలో విక్రయిస్తున్న నలుగురు వ్యక్తులను వెస్ట్‌జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మంగళవారం ఇన్‌స్పెక్టర్ ఖలీల్‌పాషా వివరాలు వెల్లడించారు. అత్తాపూర్‌కు చెందిన అజయ్‌కుమార్ బూరె వృత్తిరీత్యా ట్రాన్స్‌పోర్టు మేనేజర్, అతను కిషన్‌బాగ్‌కు చెందిన ఆటో డ్రైవర్ సయ్యద్ ఇమ్రాన్, నింబోలి అడ్డాకు చెందిన ప్రేమ్‌రాజ్ పురోహిత్, అఫ్జల్‌గంజ్‌కు చెందిన పుఖ్‌రాజ్ పురోహిత్, రాజస్థాన్‌కు చెందిన కమల్ భాటీతో కలిసి ముఠా ఏర్పాటు చేశాడు. కాచిగూడలో నకిలీ నిత్యావసర సరుకులు తయారు చేసి వాటికి ఢిల్లీ నుంచి తెప్పించుకున్న బ్రాండెడ్ లేబుల్స్, బాక్సులు, స్టిక్కర్లను అతికించి కాటేదాన్‌లోని గోడౌన్‌కు తరలించేవారు. అదను చూసుకుని డిస్ట్రిబ్యూటర్లు ప్రేమ్‌రాజ్ పురోహిత్, పుఖ్‌రాజ్ పురోహిత్, మహేందర్ సింగ్ రాథోడ్‌తో కలిసి పలు దుకాణాలతో పాటు కర్ణాటకలోని వివిధ ప్రాంతాలకు రవాణా చేసేవారు. దీనిపై సమాచారం అందడంతో టాస్క్‌ఫోర్స్ పోలీసులు వారిని అదుపులోకి తీసుకుని షాహినాయత్ గంజ్ పోలీసులకు అప్పగించారు. ఈ దాడిలో ఎస్‌ఐ ముజఫర్ అలీ తదితరులు పాల్గొన్నారు.

సత్తా చాటిన ట్రిపుల్‌ఐటీ హెచ్



ఐసీపీసీ పోటీలో ఫైనల్‌కు చేరిన విద్యార్థులు

రాయదుర్గం: ఇంటర్నేషనల్ కాలేజియేట్ ప్రోగ్రామింగ్ కాంటెస్ట్(ఐసీపీసీ) పోటీలో ట్రిపుల్‌ఐటీ హైదరాబాద్ జట్టు ఫైనల్‌కు చేరాయి. ప్రపంచంలోని అత్యంత పురాతన, ప్రతిష్టాత్మకమైన ఈ పోటీలో 111 దేశాలకు చెందిన 3వేల యూనివర్సిటీలకు చెందిన 50వేల మంది విద్యార్థులు పోటీలో పాల్గొన్నారు. ముగ్గురు విద్యార్థులతో కూడిన ట్రిపుల్‌ఐటీ టీమ్ సత్తా చాటి ఫైనల్‌కు చేరుకుంది. ఐసీపీసీ సాధారణ కోడింగ్ పోటీకాదు. ఇది మానసికంగా గొప్ప క్రీడా ఈవెంట్, ఇక్కడ పరిష్కరించబడిన అల్గారిథమిక్ ప్రోగ్రామింగ్ సమస్యల వేగం, సంఖ్య ఆధారంగా జట్లను అంచనా వేస్తారు. ప్రోగ్రామర్లు కోడ్‌ను ఏకాంతంగా పగులగొట్టే అపోహాలను ఇది తొలగించినందున జట్టు ప్రయత్నం ఇక్కడ ప్రత్యేకంగా నిలుస్తోంది. ట్రిపుల్‌ఐటీ హైదరాబాద్ విద్యార్థులు 2012 నుంచి ఐసీపీసీలో చురుగ్గా పాల్గొంటున్నారు. మొత్తం 14సార్లు పాల్గొనగా, 12 సార్లు ఫైనలిస్టులుగా అర్హత సాధించారు. ఈసారి పోటీల్లో అమూల్ అగర్వాల్, అలసన్ చౌదరి, ఆదిత్యవర్మలతో కూడిన బృందం పాల్గొంది. 250కి పైగా కళాశాలల నుంచి దాదాపు 1,500 జట్లను ఓడించింది. ఇందులో అగ్రశ్రేణి ఐఐటీలు, ఎన్‌ఐటీలు, బిట్స్ నుంచి అత్యుత్తమ భారతీయ జట్లే కాకుండా కొన్ని అత్యుత్తమ అంతర్జాతీయ జట్లు కూడా ఉన్నాయి.

ముగ్గురు పిల్లలతో తల్లి అదృశ్యం



స్వాతి (ఫైల్)



పిల్లలు (ఫైల్)

శంషాబాద్: ముగ్గురు పిల్లలతో సహా తల్లి అదృశ్యమైన ఘటన ఆర్‌జీఐఏ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని సాతంరాయి రాజీవ్‌గృహకల్పలో మేకల సహదేవ్ అతడి భార్య స్వాతి ముగ్గురు పిల్లలతో కలిసి అద్దెకు ఉంటున్నారు. కాగా ఈ నెల 2న భార్యభర్తలు గొడవ పడగా.. భార్య ముగ్గురు పిల్లలతో కలిసి ఇంటి నుంచి బయటికి వెళ్లి తిరిగి రాలేదు. ఆచూకీ కోసం వెతికినా ఫలితం లేకపోవడంతో భర్త మంగళవారం ఆర్‌జీఐఏ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బీజేపీ బలోపేతానికి కలిసికట్టుగా పనిచేయాలి

రాయదుర్గం: బీజేపీని మరింత బలోపేతం చేయడానికి అందరూ కలిసికట్టుగా పనిచేయాలని గచ్చిబౌలి డివిజన్ కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి కోరారు. బూత్ స్వశక్తికరణ్ అభియాన్‌లో భాగంగా గచ్చిబౌలి డివిజన్‌లోని గౌలిదొడ్డి, నానక్‌రాంగూడలోని శక్తి కేంద్రాల ఇన్‌చార్జీలు, స్వల్పకాలిక విస్తారకుల సమావేశంలో ఆయన సోమవారం రాత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించాలని బీజేపీ గెలుపు బాధ్యతను అందరూ తీసుకోవాలన్నారు. దేశంలో ఎక్కడ ఎన్నికలు జరిగినా బీజేపీ అనూహ్య ఫలితాలు సాధిస్తోందని, రానున్న ఎన్నికలలో కూడా బీజేపీ జెండాను శేరిలింగంపల్లిలో ఎగిరేలా చేయాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి నర్సింహారావు, బీజేపీ సీనియర్ నాయకులు హన్మంతునాయక్, వరలక్ష్మి, శ్రీకాంత్‌రెడ్డి, తిరుపతి, కిషన్, శివసింగ్, హరీష్‌శంకర్‌యాదవ్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

బాబూ జగ్జీవన్‌రామ్ జయంతికి ఏర్పాట్లు పూర్తి



సమావేశంలో పాల్గొన్న కమిటీ సభ్యులు

రాజేంద్రనగర్: డాక్టర్ బాబూ జగ్జీవన్‌రామ్ జయంతిని బుద్వేల్ చౌరస్తాలో బుధవారం ఘనంగా నిర్వహిస్తున్నట్లు బుద్వేల్ బాబూ జగ్జీవన్‌రామ్ కమిటీ సభ్యులు ప్రకటించారు. మంగళవారం ఈ కార్యక్రమానికి సంబంధించిన పనులను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రతి ఏటా బుద్వేల్ కమిటీ, అరుంధతి వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బీజేఆర్ జయంతి కార్యక్రమాలను చేపడుతున్నామన్నారు. బుధవారం ఉదయం 7 గంటలకు ఈ కార్యక్రమం ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. ముఖ్య అతిథులుగా విద్యాశాఖ మంత్రి సబితాఇంద్రారెడ్డి, ఎంపీ రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్, ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డి, కార్పొరేటర్లు తోకల శ్రీనివాస్‌రెడ్డి, అర్చనాజయప్రకాష్, సంగీతాగౌరీశంకర్, తహసీల్దార్ చంద్రశేఖర్, డిప్యూటీ కమిషనర్ జగన్ తదితరులు హాజరవుతారన్నారు. దళిత సంఘాల ప్రతినిధులు, ప్రజలు పెద్ద ఎత్తున తరలిరావాలని కమిటీ సభ్యులు కోరారు.

మహనీయుల జయంత్యుత్సవాలను ఘనంగా నిర్వహించాలి..

మహనీయుల జయంత్యుత్సవాలను నేటి తరానికి ఆదర్శంగా ఉండేలా ఉత్సవాలు నిర్వహించాలని ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ సూచించారు. రాజేంద్రనగర్ మహాత్మ జ్యోతిరావుపూలే జయంత్యుత్సవ కమిటీ బ్రోచర్‌ను ఆయన మంగళవారం తన నివాసంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఏప్రిల్ మహనీయుల జయంత్యుత్సవాలతో కలకలలాడుతోందని వారి ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలన్నారు. మహనీయులు జీవితచరిత్రను నేటి తరానికి ఆదర్శంగా ఉండేలా చూడాలన్నారు. జయంత్యుత్సవ కమిటీ వ్యవస్థాపక అధ్యక్షుడు కృష్ణమాచారి, అధ్యక్షుడు ముద్దగొనీ మల్లికార్జున్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి పిట్టల శివముదిరాజ్, మాజీ అధ్యక్షుడు సత్యనారాయణముదిరాజ్, శ్రీను, భిక్షపతి, అడికే అర్జున్, కమిటీ సభ్యులు, బీసీ సంఘం నేతలు పాల్గొన్నారు.



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్

పిల్లలకు తప్పనిసరిగా టీకాలు వేయించాలి



రాజేంద్రనగర్: వ్యాధులు సోకకుండా ముందు జాగ్రత్తగా తల్లిదండ్రులు తమ పిల్లలకు టీకాలు వేయాలని రాజేంద్రనగర్ బీఆర్‌ఎస్ పార్టీ నాయకుడు పచ్చ శ్రీనివాసులు కోరారు. రాజేంద్రనగర్ వైద్య బృందం ఆధ్వర్యంలో అంబేడ్కర్ కాలనీలో మంగళవారం పిల్లలకు టీకా కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ప్రస్తుతం చిన్నారులకు చికెన్‌పాక్స్ తదితర వ్యాధులు సోకకుండా ప్రభుత్వం ఉచితంగా టీకాలను వేస్తోందన్నారు. 9 నెలల నుంచి 9 ఏళ్లలోపు పిల్లలందరికీ తప్పనిసరిగా టీకాలను వేయించాలని సూచించారు. పిల్లల తల్లిదండ్రులు ఎలాంటి అపోహలకు గురికాకుండా టీకాలను వేయించాలన్నారు. బస్తీల వారీగా రోజూ ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు టీకాలను అందిస్తున్నామన్నారు.

విద్యార్థుల్లో నైపుణ్యాన్ని పెంచాలి



ప్రశంసాపత్రాలు అందుకున్న విద్యార్థులతో అతిథులు

మణికొండ: విద్యార్థుల్లో అన్ని రంగాలలో నైపుణ్యాన్ని పెంచేందుకు పాఠశాలలు, ఉపాధ్యాయులు కృషి చేయాల్సిన అవసరం ఉందని సహాయ ప్రొఫెసర్ డాక్టర్ పద్మ అన్నారు. మణికొండ నారాయణ పాఠశాలలో మంగళవారం నిర్వహించిన మాస్టర్ ఒరియేంటర్ కాంటెస్ట్ పోటీలను నిర్వహించారు. విద్యాసంస్థల జీఎం గోపాల్‌రెడ్డి, ఎస్ఎస్ జోన్ ఏజీఎం శ్రీనివాస్‌రెడ్డిలతో కలిసి ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఇంగ్లిష్ పరిజ్ఞానాన్ని పెంపొందించి వారిని మరింత తీర్చిదిద్దేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఉపయోగపడతాయన్నారు. ప్రతిభ చూపిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలను అందజేశారు. ప్రధానోపాధ్యాయులు వెంకటకృష్ణ, ఉపాధ్యాయులు పర్హానా, రష్మిక, గీత, మాధవరెడ్డి, సౌమ్య, వెంకట్ విద్యార్థులు పాల్గొన్నారు.

వదినను హత్య చేసిన మరిది

- భర్త కళ్లముందే ఘాతుకం
- అదనపు కట్నం తేవాలంటూ వేధింపులు



షాహీన్‌బేగం(ఫైల్)

రాజేంద్రనగర్: 'పుట్టింటి నుంచి ఇంకెన్ని రోజులు డబ్బులు తెచ్చివ్వాలి?' అని అత్తను ప్రశ్నించిన ఓ మహిళను ఆమె మరిది గొంతు నులిమి హత్య చేసిన సంఘటన అత్తాపూర్ ఔట్‌పోస్టు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ క్రాంతికుమార్ తెలిపిన వివరాల ప్రకారం..కర్ణాటకకు చెందిన షాహీన్‌బేగం (27) వివాహం నా నెంబర్ జలాల్‌బాబానగర్‌లోని సయ్యద్ అలీతో రెండు సంవత్సరాల క్రితం జరిగింది. వీరికి ఒక కుమారుడు సంతానం. మంగళవారం కుమారుడి మొదటి పుట్టిన రోజు కావడంతో సోమవారం రాత్రి షాహీన్‌బేగం తగు ఏర్పాట్లు చేసుకుంటుంది. ఇదే సమయంలో అత్త పెద్ద షాహీన్‌బేగం, భర్త సయ్యద్ అలీ, మరిది సయ్యద్‌పాషాలు అడ్డుకుని పుట్టింటి నుంచి కట్నం కింద డబ్బులు తీసుకురావాలని వేధించారు. ఆర్నెళ్ల క్రితమే లక్ష రూపాయలు ఇచ్చారని, మళ్లీ ఎక్కడ నుంచి తేవాలని షాహీన్‌బేగం ప్రశ్నించడంతో.. ఆవేశానికి గురైన మరిది సయ్యద్ పాషా ఆమెపై దాడి చేసి గొంతునులిమాడు. దీంతో ఊపిరి ఆడక మృతి చెందింది. అనంతరం ముగ్గురు కలిసి ఏమి తెలియనట్లు ఇంటి బయట కూర్చొని తమ కోడలు స్పృహతప్పి పడిపోయింది అంటూ స్థానికులకు వెల్లడించారు. ఇదే విషయమై స్థానికులు అత్తాపూర్ ఔట్‌పోస్టు పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. భర్త, మరిది, అత్త పొంతన లేని సమాధానాలు చెప్పడం, మృతి చెందిన షాహీన్‌బేగం తల్లిదండ్రులు అదనపు కట్నం కోసం అత్త వేధించారని ఫిర్యాదు చేయడంతో పోలీసులు ముగ్గురిని వేర్వేరుగా విచారించారు. దీంతో హత్య విషయం వెలుగులోకి వచ్చింది. ముగ్గురిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.